# స్పీడ్‌కు కళ్లెం




- రెండేండ్లలో 21,594 స్పీడ్‌గన్ కేసులు నమోదు
- ఇప్పటివరకు వికారాబాద్ జిల్లాలో రూ.1.37 కోట్ల జరిమానా
- గతేడాది 12,398 కేసులు, ఈ ఏడాది ఇప్పటివరకు 9,196 కేసులు
- బీజాపూర్ హైవే పరిధిలోని మన్నెగూడ, పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్ సమీపంలో స్పీడ్‌గన్స్ ఏర్పాటు
- వాహనాల వేగానికి చెక్ పెట్టిన పోలీసులు
- రెండేండ్లుగా తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- జాతీయ రహదారిపై వేగం 60 దాటితే రూ.1035ల ఫైన్

**జాతీయ రహదారిపై వేగంగా దూసుకెళ్తున్నారా? అయితే మీ జేబుకు చిల్లు పడడం ఖాయం. వాహనాల మితిమీరిన వేగానికి కళ్లెం వేసేందుకు పోలీసు, రవాణా శాఖ అధికారులు నియంత్రణ చర్యలు చేపట్టారు. స్పీడ్‌గా దూసుకెళ్లే వాహనాలను గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. ఇందుకోసం స్పీడ్‌గన్‌లు వినియోగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్దేశించిన గరిష్ట వేగం దాటి ప్రయాణిస్తే స్పీడ్ గన్స్ ఇట్టే పట్టేస్తాయి. దీంతో చలానులను అధికారులు ఇంటికే పంపిస్తున్నారు.**

వికారాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లాలోని బీజాపూర్ జాతీయ రహదారిపై నాలుగు చోట్ల స్పీడ్ గన్స్ ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. వేగంగా వెళ్లే వాహనాలకు కళ్లెం వేశారు. జిల్లాలోని ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతాయనేది జిల్లా పోలీస్, రవాణా శాఖ ఆధ్వర్యంలో గుర్తించారు. దీంతో అధికారులు జిల్లాలోని బీజాపూర్ హైవేపై వెళ్లే మన్నెగూడ, పరిగి, బొంరాస్‌పేట, కొడంగల్ ప్రాంతాల్లో స్పీడ్ గన్ యంత్రాలను ఏర్పాటు చేసి నిర్ణీత వేగానికి మించి వాహనాలు వెళితే జరిమానాలు విధిస్తున్నారు. ఈ యంత్రాలు ఏర్పాటు చేసిన తర్వాత వేగంగా వెళ్లే వాహనాలకు చెక్ పెట్టడంతో పాటు తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకున్న చర్యలు విజయవంతం అయ్యాయి. హైదరాబాద్-బీజాపూర్ నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేసిన దృష్ట్యా వాహనాల వేగానికి చెక్ పెట్టేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో స్పీడ్ గన్స్ అమర్చి రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గుముఖం పట్టేలా చర్యలు చేపట్టారు.

**అతివేగంతో.. తరచూ రోడ్డు ప్రమాదాలు**

జిల్లా మీదుగా వెళ్లే బీజాపూర్ జాతీయ రహదారిపై నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. అతివేగంతోనే బీజాపూర్ రహదారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ, చాలా మంది మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించడంతోపాటు వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్‌గన్స్‌ను జిల్లా యంత్రాంగం అమల్లోకి తీసుకొచ్చింది. మరోవైపు ఔటర్ రింగ్‌రోడ్డుపై 120 కిలోమీటర్ల కంటే ఎక్కువ వేగంతో వెళితే సంబంధిత వాహనదారులకు జరిమానా విధిస్తుండగా బీజాపూర్ హైవేపై 60 కిలోమీటర్ల కంటే వేగంగా వెళితే సంబంధిత వావానదారులకు జరిమానా విధించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే జిల్లాలోనూ వేగంగా వెళ్లే వాహనాదారుల నుంచి రూ.1035 జరిమానా వసూలు చేస్తున్నారు. 60 కిలోమీటర్ల వేగం కంటే అధిక వేగంతో వెళ్లే వాహనాల ఫొటోలు తీసి సంబంధిత వాహనదారుడి మొబైల్ నంబర్‌కు మెస్సేజ్ రూపంలో పంపిస్తున్నారు. సంబంధిత మెస్సేజ్‌లో వాహనం వెళ్లిన స్పీడ్, తేదీ, సమయం, ఎంత దూరం నుంచి ఫొటో తీసిందో, స్పీడ్ లిమిట్, వెహికల్ లైసెన్స్, నంబర్ ప్లేట్ వివరాలతో కూడిన జరిమానా వివరాలను వాహనదారులకు నేరుగా ఇంటికి పంపిస్తున్నారు. ఈ యంత్రాలతో పగటి పూటతోపాటు రాత్రి సమయాల్లోనూ వేగంగా వెళ్లే వాహనాలకు చెక్ పెట్టనున్నారు. అయితే జిల్లాలో గత రెండేండ్లలో నిర్ణీత వేగానికి మించిన వెళ్లిన వాహనదారులకు రూ.1,37,42,790 జరిమానాను జిల్లా పోలీసు యంత్రాంగం విధించింది. రెండేండ్లలో 21,594 కేసులు నమోదు చేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. 2022 సంవత్సరంలో 12,398 కేసులు నమోదు చేసి రూ.1,27,89,930 జరిమానా విధించారు. ఈ ఏడాది ఇప్పటివరకు 9,196 కేసులు నమోదు కాగా రూ.9,52,860ల జరిమానా విధించారు.

## రోడ్డు ప్రమాదాలకు చెక్..

స్పీడ్ గన్ యంత్రాల ద్వారా జిల్లా రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. జిల్లాలో ప్రతీరోజు ఎక్కడో ఓ చోట రోడ్డు ప్రమాదంతో ఐదారుగురు మృత్యువాత పడిన ఘటనలు ఉన్నాయి. గతంలో సగటున ఏడాదికి జిల్లావ్యాప్తంగా 400 వరకు రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు అవగాహన కల్పించినా ప్రమాదాలు మాత్రం తగ్గలేదు. అయితే జిల్లాలో ఏర్పాటు చేసిన స్పీడ్ గన్ యంత్రాలతో వాహనాల వేగానికి కళ్లెం పడడంతోపాటు రోడ్డు ప్రమాదాలు పూర్తిగా తగ్గాయి. స్పీడ్ గన్ యంత్రంతో రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతున్నది. పరిమితికి మించి వేగంగా వెళ్లే వాహనదారులకు విధించే జరిమానాలతో ప్రభుత్వానికి రెవెన్యూ వస్తున్నది. అయితే స్పీడ్ గన్స్‌ను అమల్లోకి తీసుకురావడంతో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గడంతోపాటు ప్రభుత్వ ఖజానాకు జరిమానాతో ఆదాయం చేకూరుతున్నది. మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై కూడా చర్యలు తీసుకుంటున్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే జరిమానా విధించడంతోపాటు కేసు నమోదు చేయడంతోపాటు మద్యం సేవించి రెండు మార్లు పట్టుబడితే వారి లైసెన్సులను కూడా రద్దు చేస్తూ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారు.

# నేటి నుంచి ధ్యాన మహాయాగం

**మహేశ్వర మహా పిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాసభలకు ఏర్పాట్లు పూర్తి**



ధ్యానం చేయడానికి సిద్ధమైన సభా ప్రాగంణం

కడ్తాల్, డిసెంబర్ 20 : మండల పరిధిలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం-2 సభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 21 నుంచి 31 వరకు 11 రోజులపాటు నిర్వహించే ధ్యాన మహాయాగ సభలకు ఏర్పాట్లు పూర్తి చేశామని, ధ్యాన సభలకు వివిధ ప్రాంతాల నుంచి పిరమిడ్ మాస్టర్లు, అధ్యాత్మిక వేత్తలు, ధ్యాన గురువులు హాజరవుతున్నట్లు పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయ భాస్కర్‌రెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ధ్యానులకు పిరమిడ్ ఆవరణలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. పిరమిడ్ ఆవరణలో సీసీ కెమెరాలతో పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేశారు. ధ్యాన కార్యక్రమాలను వీక్షించడానికి సభా ప్రాంగణంలో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం పత్రీజీ సతీమణి స్వర్ణమాల జ్యోతి ప్రజ్వలన చేసి మహా సభలను ప్రారంభిస్తారని విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం ఐదు నుంచి రాత్రి 8 గంటల వరకు సంగీత విద్యాంసులచే అఖండ ధ్యానం, సుభాశ్ పత్రీజీ వీడియో సందేశం, ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు ఆధ్యాత్మిక ప్రవచనాలు, గురువుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ట్రస్టు చైర్మన్ వివరించారు.

# న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**ఎస్పీ కోటిరెడ్డి**

వికారాబాద్, డిసెంబర్ 20 : నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి పోలీస్ శాఖ తరపున కొన్ని సలహాలు సూచనలు పాటించాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ కోటి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజేలకు అనుమతి లేదన్నారు. రిసార్ట్, ఫామ్ హౌస్‌లపై ప్రత్యేకమైన నిఘా ఉంటుందన్నారు. ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు జరపనాదన్నారు. మద్యం తాగి వాహనాలను నడుపరాదన్నారు. నిబంధనలు పాటించకపోతే వాహనాలను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 31న అర్ధరాత్రి సమయంలో బైక్ ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నూతన సంవత్సరం ఉదయం ప్రతి పోలీస్ స్టేషన్‌లో నాకాబందీ, వాహన తనిఖీలు, డ్రంక్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా పెట్రోలింగ్, బందోవస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలీసు అధికారుల విధులకు ఎవరైన ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించే వారు ముందుగా పోలీస్ శాఖతో పాటటు ఇతర శాఖల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ప్రతి కార్యక్రమంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ ఇబ్బందులు కలుగకుండా, ట్రాఫిక్ సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి



ఇబ్రహీంపట్నం : వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్ తదితరులు

ఇబ్రహీంపట్నం/వికారాబాద్, డిసెంబర్ 20 : రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలని, ఓటరు జాబితా తయారీతో పాటు ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. బుధవారం రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, ఆయా నియోజకవర్గా రిటర్నింగ్ అధికారులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్‌లో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి గీతారెడ్డి, వికారాబాద్ అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్, ఆర్డీవోలు విజయ కుమారి, శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికలపే పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ఓటర్ల జాబితా నిర్దే శించిన గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. 18 ఏండ్ల వయస్సు నిండిన ప్రతి ఒక్కరూ ఓట రుగా నమోదు అయ్యేలా చూడాలన్నారు. ఇందు కోసం అ వగాహన కార్యక్రమాలు చేపట్టాలని, మార్పులు చేర్పులు చిరునామా మారిన వారు చేసుకున్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అన్ని మండలా ల్లో త హసీల్దార్లు, సంబంధిత ఎలక్షన్ సెక్షన్ సూ పరింటెండెంట్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



వికారాబాద్ : వీసీకి హాజరైన జిల్లా అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు

# కన్హాశాంతి వనంలో ఆటా ప్రతినిధులు



ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో ఆటా ప్రతినిధులు

నందిగామ, డిసెంబర్ 20 : రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హాశాంతి వనాన్ని ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని ఆధ్వర్యంలో ఆటా ప్రతినిధులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి ధ్యాన కేంద్రంలో ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ధ్యానం, యోగ చేస్తే కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆటా వేడుకల చైర్, ఎలెక్ట్ ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఆటా వేడుకల కోచైర్ వేణు సంకినేని, సెక్రటరీ రామ కృష్ణారెడ్డి, ట్రెజరర్ సతీశ్‌రెడ్డి, జాయింట్ ట్రెజరర్ రవీందర్, సాయి సూదిని, కాశీ కొత్త, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.